సాక్షి
మెదక్

ఆదివారం । 12 । మార్చి । 2023



ఆయుష్మాన్‌తో ఉచిత వైద్యం

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ కింద తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి రూ. ఐదు లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్నాయి. 8లో



నాచగిరిలో ఆధ్యాత్మిక వైభవం

ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధమైన నాచారం గుట్ట శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. 8లో



భవన నిర్మాణం.. ఆలస్యం

దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించలేదు అన్న చందంగా మారింది అల్లాదుర్గం పీఏసీఎస్ పరిస్థితి. పక్కా భవన నిర్మాణానికి నిధులు ఉన్నా పనులు ముందుకు సాగడం లేదు. 9లో

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోమారం, సికింద్లాపూర్, శభాష్‌పల్లి, గుండ్లపల్లి, దంతన్‌పల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైల్వేలైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి చేయాలి

మెదక్‌జోన్: మెదక్ నుంచి మీర్జాపల్లి వరకు రైల్వేలైన్ వేసేందుకు ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అక్కన్నపేట– మెదక్ రైల్వేలైన్ కోసం కృషి చేశానని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలోనే 50 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులు తెచ్చేందుకు కృషి చేసినట్లు చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యురాలిగా ఎన్నికైనందున శుభాకాంక్షలు తెలిపారు.

అలరిస్తున్న శతావధానం



శతావధానంలో కవులు, రచయితలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీలలితా చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన డాక్టర్ పట్వర్ధన్ శతావధానం సాహితీ అభిమానులను ఎంతగానో అలరించింది. నిషిద్ధాక్షరి, సమస్య, వర్ణన, దత్తపది, ఆశువు, అప్రస్తుతం తదితర అంశాలతో పృచ్ఛకులు అడిగే వాటికి అవధాని పట్వర్ధన్ హృద్యంగా చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దొర్బల ప్రభాకరశర్మ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో అవధానాలకు ప్రముఖ స్థానం ఉందని, సిద్దిపేటలో అవధానాలకు, అవధానులకు కొదువలేదన్నారు. అవధానంలో ఎంతగానో ఖ్యాతి గడించిన అష్టకాల నరసింహారామశర్మ మరణం తీరని లోటని అన్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శతావధానం జరుగనుందన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పండరి రాధాకృష్ణ, సింగీతం నరసింహారావు, సరస్వతి రామశర్మ, ఉండ్రాళ్ల రాజేశం, మరుమాముల దత్తాత్రేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. రెండవ శనివారం సెలవు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. దాతల సహాయంతో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ, సిబ్బంది ఉన్నారు.

కుప్పకూలుతున్నారు!

- జిల్లావ్యాప్తంగా 11 రోజుల్లో ఏడుగురు మృత్యువాత
- ఆందోళన కలిగిస్తున్న మరణాలు

మెదక్‌జోన్: జిల్లాలో గుండెపోటు మరణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. కేవలం 11 రోజుల వ్యవధిలో ఏడుగురు గుండెపోటుతో మృత్యువాత పడ్డారు. వీరిలో ఎక్కువగా యువకులు ఉండడం ఆందోళన కలిగించే అంశం.

- గతనెల 26న శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చెందిన లక్ష్మణ్ చేపల వేటకు వెళ్లి చెరువు వద్దే గుండెపోటుకు గురై మృతిచెందాడు.
- ఫిబ్రవరి 28న గజ్వేల్ డిపోనకు చెందిన ఆర్టీసీ కండక్టర్ భిక్షపతి (45) నర్సాపూర్ డిపోలో గుండెపోటుకు గురై కుప్పకూలాడు. అతడి వెంటనే తోటి సిబ్బంది ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.
- నిజాంపేట మండలం కల్వకుంటకు చెందిన షాదుల్లా (23) హమాలీ పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 2న భోజనం చేసి పడుకున్నాడు. నిద్రలోనే గుండెపోటుకు గురై మృత్యువాత పడ్డాడు.
- మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు చెందిన అశోక్ (35) గత ఆదివారం రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. నిద్రలోనే గుండెపోటుతో మరణించాడు. తెల్లారేసరికి విగత జీవిగా మారాడు.
- మనోహరాబాద్ మండలం కేంద్రానికి చెందిన ధన్‌రాజు (45) ఈనెల 7వ తేదీన అందరితో కలిసి హోలీ జరుపుకున్నాడు. మధ్యాహ్న భోజనం చేసి పడుకున్నాడు. నిద్రలోనే గుండెపోటుకు గురై మృతి చెందాడు.
- హవేళీఘనాపూర్ మండలం చౌట్లపల్లికి చెందిన నారాయణ (55) ఈనెల 9వ తేదీ తన ఆటోలో ఘనపూర్ నుంచి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురై మృతి చెందాడు.
- పాపన్నపేట మండలం శేరిపల్లికి చెందిన యాదగిరి (36) జాతరలో ఆట వస్తువులు అమ్ముకుని జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 8న కొత్తపల్లిలో జరిగే అనంతపద్మస్వామి జాతరలో వస్తువులు విక్రయిస్తూనే గుండెపోటుకు గురై మృత్యువాత పడ్డాడు.

వయసుతో నిమిత్తం లేకుండా 'గుండెపోటు'



సీపీఆర్.. ఆపదలో రక్ష

- ఆకస్మికంగా గుండెపోటు వచ్చి అపస్మారక స్థితికి చేరుకుంటే వారికి సీపీఆర్ నిర్వహించడం ద్వారా రక్షించవచ్చని, సీపీఆర్‌పై విస్తృతంగా శిక్షణ ఇవ్వాలని ఇటీవల కలెక్టర్ రాజర్షిషా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.
- వయసుతో నిమిత్తం లేకుండా ఇటీవల చాలా మంది ఆకస్మిక గుండెపోటుతో చనిపోతున్నారని, వారికి సకాలంలో సీపీఆర్ నిర్వహించడం ద్వారా మరణాలను తగ్గించవచ్చని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా ఫ్రంట్ లైనర్స్‌కు సీపీఆర్‌పై త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు.
- ముందుగా వైద్య, మున్సిపల్, పంచాయతీ రాజ్, స్వయం సహాయక సంఘాలు, ఉపాధ్యాయులకు ఇస్తే వారి ద్వారా గ్రామాల్లో సీపీఆర్‌పై అవగాహన కలిగించేందుకు ఆస్కారముంటుంది. ఆదిశగా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో మాస్టర్ ట్రైనర్లతో మానిక్యూర్ ద్వారా ఫ్రంట్ లైనర్స్‌కు శిక్షణ ఇచ్చేందుకు తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఆహార అలవాట్లు, మానసిక ఒత్తిడి



గుండెపోటుకు ప్రధాన కారణం ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి. జంక్ ఫుడ్‌కు పూర్తిగా స్వస్తి చెప్పాలి. నాన్‌వెజ్‌ను మితంగా తినాలి. ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి మంచిది కాదు. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోయి గుండెపోటుకు దారి తీస్తోంది. జిమ్‌లో అధిక బరువులు ఎత్తడం కూడా మంచిది కాదు. 30 ఏళ్లు దాటిన వ్యక్తులు ప్రతి ఆరు నెలలకోసారి షుగర్, బీపీ, తదితర పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ చంద్రశేఖర్, డీసీహెచ్‌ఎస్

'బండి' బేషరతుగా క్షమాపణ చెప్పాలి



బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నాయకులు

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నాయకులతో కలిసి జాతీయ రహదారిపై బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే బీజేపీ నాయకులు ఈడీ, సీబీఐతో తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసే నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, మన్సూర్, బబియానాయక్, నర్సింగ్‌రావు, జితేందర్‌రెడ్డి, నయిమొద్దీన్, శేఖర్, భిక్షపతి, సంధ్యారాణి, లక్ష్మి, శ్రీధర్‌గుప్తా, సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి తేనెటీగల పెంపకంపై శిక్షణ

ములుగు(గజ్వేల్): ములుగు అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో 14వ తేదీ నుంచి తేనెటీగల పెంపకంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శైలజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ నుంచి 20 వరకు, 23 నుంచి 29వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నా రు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి అల్పాహారం, భోజనం, టీ, రాత్రి భోజనం, బస ఏర్పాట్లు కల్పించబడుతాయన్నారు. అలాగే ప్రయాణ భత్యం సైతం చెల్లించబడుతుందన్నారు. ఆసక్తిగల రైతులు పూర్తి వివరాలకు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వసీమ్‌ను (7876531614) నంబర్‌లో సంప్రదించాలన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేటఅర్బన్: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత మోటార్ సైకిల్‌ను అందించాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. ఇళ్లు లేని నిరుపేద కార్మికులకు ఇంటి స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కనకయ్య, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములు గుంజుకుంటే ఆగమే



భూ బాధితులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

ట్రిపుల్‌ఆర్ భూ బాధితుల ఆవేదన

గజ్వేల్: రీజినల్ రింగు రోడ్డు(ట్రిపుల్‌ఆర్) నిర్మాణం పేరిట తమకు బతుకుదెరువైన సాగు భూములను గుంజుకుంటే ఎలా బతకాలని గజ్వేల్ నియోజకవర్గంలోని లింగరాజుపల్లి, ముట్రాజ్‌పల్లి, కోమటిబండ, జబ్బాపూర్, నెంటూర్ గ్రామాల్లోని భూబాధితులు ప్రజా సంఘాల నేతల ముందు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయా గ్రామాల్లో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగన్న, డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్, ఆయా సంఘాల నాయకులు హరికృష్ణ, రోహిత్, సంజీవ్, దాసరి ఏగొండస్వామి, బ్యాగరి వేణు తదితరులు పర్యటించి భూ బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. లింగరాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు భిక్షపతి, నెంటూర్‌కు చెందిన మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్‌ఆర్ వల్ల ఎవరికి లాభం జరుగుతుందో కానీ తమ బతుకులు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. కొండపోచమ్మసాగర్ కాల్వ కోసం తాము ఇప్పటికే భూములు కోల్పోగా తాజాగా ట్రిపుల్‌ఆర్ కోసం కూడా భూములను లాక్కుంటున్నారని జబ్బాపూర్ రైతులు ప్రజా సంఘాల నేతల ముందు ఆందోళన చెందారు. ఈ సంర్భంగా అంబటి నాగన్న, శంకర్ మాట్లాడుతూ సాగుకు యోగ్యమైన భూములు వదిలిపెట్టి సాగుకు పనికిరాని భూములను మాత్రమే రీజినల్ రింగు రోడ్డు కోసం సేకరించాలని డిమాండ్ చేశారు. 2013 చట్టం ప్రకారమే భూసేకరణ జరగాలన్నారు. నెంటూర్ గ్రామంలో తన భూమి పోతుందనే భయంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినా ఆయనను పరామర్శించి మనోధైర్యం నింపకపోవడం దారుణమన్నారు. బాధితులకు అండగా పోరాడుతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం శివ్వంపేటలో పంచాయతీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెండు వేలకు పైగా కార్మికులు ఉన్నారని, వారికి సరైన వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. చాలిచాలనీ వేతనాలతో వెట్టి చాకరి చేయిస్తున్నారని పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ పరిధిలో కారోబార్, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, నీటి సరఫరా విధుల్లో పనిచేస్తున్న వారికి సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆసిఫ్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పాపన్నపేట(మెదక్): క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని కొడుపాకలో స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల పలువురు యువకులు గుండెపోటుతో మరణించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సీపీఆర్‌పై శిక్షణ కోసం కలెక్టర్ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారని.. ఎవరైనా శిక్షణ పొందాలంటే కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. క్రీడలు, సరైన వ్యాయామం, పోషకాహారం, జీవనశైలి మంచి ఆరోగ్యానికి మూలాలన్నారు. కార్యక్రమంలో ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, ఎస్సై విజయ్, రిటైర్డ్ ఎంఈఓ మోహన్‌రాజు, సర్పంచ్ సంగప్ప, ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ పంతుల భూమయ్య, ఉపసర్పంచ్ దుర్గేశ్, తదితరులు పాల్గొన్నారు. కబడ్డీకి 35 టీంలు, వాలీబాల్‌కు 32, డ్యాన్స్ కాంపిటీషన్‌కు 28 టీంలు హాజరుకాగా ఆదివారం విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): కేంద్ర ప్రభుత్వం అందించే వ్యవసాయ సబ్సిడీలను రైతులు వినియోగించుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు కోరారు. మండలంలోని కరీంనగర్‌లో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు వ్యాపార సహకార సంస్థను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల యూనిట్‌గా మూడు వందల సభ్యులతో రైతులతో వ్యాపార సహకార సంఘం ఏర్పాటు చేసుకుంటే సభ్యులకు సబ్సిడీలతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం రుణం తీసుకునే అవకాశం ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు కేంద్రం అందించే వ్యవసాయ సబ్సిడీలు అందుకోవడానికి సంఘాలుగా ఏర్పడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ బాల్‌చందర్, బీజేపీ నాయకులు భూపాల్, గోవింద్, సంతోష్‌రెడ్డి, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

జాతర ముగింపునకు అగ్నిగుండాలు

కొమురవెల్లి పాలక మండలి పలు తీర్మానాలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన పాలక మండలి సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశం చైర్మన్ గీస భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ఇందులో భాగంగా జాతర ముగింపు సందర్భంగా అగ్నిగుండాల నిర్వహణ, టీటీడీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు, పాత బుకింగ్ కార్యాలయం, లడ్డు ప్రసాదశాలను తొలగించి ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయుట, స్వామి వారి గుట్ట పైన సుతిమాను గుండుపై త్రిశూలం, ఢమరుకం ఏర్పాటు, బండ గుట్టపై నిర్మిస్తున్న 50 గదుల ధర్మశాలకు విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, 2 లక్షల లీటర్ల ఓవర్‌హెడ్‌ట్యాంకు నిర్మాణం, ఎల్లమ్మ దేవాలయం రోడ్డుకు ఆర్చి గేటు నిర్మాణం తదితర పనులు, అన్నదానానికి రూ.50,116, రూ. 1,00,116 చెల్లించిన సభ్యులకు ఐదుగురికి భోజన సౌకర్యంతో పాటు ప్రత్యేక దర్శనం సౌకర్యం కల్పించనున్నట్లు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఈవో బాలాజీ, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ధర్మకర్తలు చెట్కూరి తిరుపతి, ఎర్రగొల్ల మల్లేశం, కొంగరి గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొమురవెల్లికి మంత్రి తలసాని

రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేడు కొమురవెల్లి మల్లన్నను దర్శించుకోనున్నట్లు ఆలయ అధికారులు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటకు హైదరాబాద్‌లో బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు ఆలయానికి చేరుకొని స్వామి వారిని దర్శించుకోనున్నట్లు తెలిపారు.



సమావేశంలో చైర్మన్ భిక్షపతి, ధర్మకర్తలు

బీఆర్‌ఎస్ నాయకుల అవినీతిపై పోరాటం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకుల అవినీతిపై పోరాటం చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు భారీస్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అడ్డగోలుగా బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్నా ఎమ్మెల్యే స్పందించడం లేదన్నారు. ఇటీవల రెండు లారీల రేషన్ బియ్యం పట్టుకున్నప్పటికీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అధికారులను బెదిరించి లారీలు విడిచిపెట్టించారని వాపోయారు. బియ్యం కుంభకోణంపై విచారణ చేయించాలని, లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాగా ఎమ్మెల్సీ కవితను ఈడీ విచారణ చేస్తామంటే బీఆర్‌ఎస్ నాయకులు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కవిత లిక్కర్ స్కాంలో భాగస్వామ్యం ఉన్నందున ఆ పార్టీ నాయకులు భయపడుతున్నారని అన్నారు. సమావేశంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నాయకులు సురేశ్, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, రవిగౌడ్, ఆంజనేయులుగౌడ్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీ ఆటో ఢీ: ఒకరి మృతి


మహ్మద్ జాకీర్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: ఆటోను లారీ ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శనివారం ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జహీరాబాద్‌కు చెందిన మహ్మద్ జాకీర్ (44) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. ఈనెల 10వ తేదీన తన ఆటోలో ప్రయాణికులను తీసుకొని హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి అర్ధ రాత్రి జహీరాబాద్‌కు వెళ్తుండగా పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామ శివారులో పంజాబీ దాబా సమీపంలో పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వెళ్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన జాకీర్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రిజ్వాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అత్తను చూసివస్తానని..


విఠల్ మృతదేహం

రామాయంపేట(మెదక్): కౌడిపల్లి మండలం కుషన్‌గడ్డ తండాకు చెందిన విఠల్‌నాయక్ మృతదేహాన్ని రామాయంపేట మండలం ఝాన్సి లింగాపూర్ గ్రామశివారులో గ్రామస్థులు కనుగొన్నారు. శనివారం ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఝాన్సిలింగాపూర్‌లో ఉన్న తన అత్తను చూసి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అక్కన్నపేటలో కల్లు తాగి అక్కడే తిరిగాడు. ఉదయం విగతజీవిగా పడి ఉండటం చూసిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విఠల్ మృతికి కారణాలు తెలియరాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చెలిమితండాలో దొంగల హల్‌చల్

రూ.5.50 లక్షల నగదు, తులం బంగారం చోరీ

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలం దుబ్బతండా గ్రామపంచాయతీ పరిధి చెలిమి తండాలో దొంగలు హల్‌చల్ చేశారు. ఒకేరోజు మూడు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు రూ.5.70 లక్షలు దొంగతనం చేశారు.ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెలిమితండాకు చెందిన భూక్య గోపాల్ అతడి సోదరులు కలిసి శుక్రవారం సాయంత్రం బంధువుల ఇంటిలో జరిగే వివాహానికి వెళ్లారు. శనివారం సాయంత్రం భాను తిరుపతి ఫోన్‌చేసి మీ ఇంటి తాళం పగులగొట్టడంతోపాటు తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఇంటికి వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రూ.3.10 లక్షల నగదు, తమ్ముడు భూక్య చందర్ ఇంటిలో రూ.1.99 లక్షల నగదు, మరో తమ్ముడు భూక్య రాజు ఇంట్లో రూ.40 వేల నగదు, తులం బంగారం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రహించారు. చోరీలపై భూక్య గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆయుష్మాన్‌తో ఉచిత వైద్యం

- రూ.5 లక్షల వరకు వైద్య సేవలు
- ఈనెల 31వ తేదీతో ముగియనున్న ఈ–కేవైసీ గడువు
- నమోదుకు తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి


శివంపేటలో ఆయుష్మాన్ భారత్ వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ కింద తెల్లరేషన్ కార్డు (ఫుడ్ సెక్యూరిటీ కార్డు) కలిగిన వారికి రూ.5 లక్షల వరకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ కింద రూ.2 లక్షలు వరకు వైద్య ఖర్చులు చెల్లించేవారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య శ్రీ విలీనంతో అదనంగా రూ.3 లక్షలు వరకు లాభం చేకూరనుంది. ఈ మేరకు సంగారెడ్డి జిల్లాలో ప్రత్యే శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు.

అనుసంధాన విధానం

- కొత్త రేషన్ కార్డు నంబర్‌తో ఆయుష్మాన్ భారత్‌కు అనుసంధానం చేస్తారు. ఆధార్‌కార్డ్, గతంలో రేషన్ కార్డుకు అనుసంధానం చేసిన సెల్‌ఫోన్ నంబర్‌కు చెబితే ఓటీపీ ద్వారా పొందుపరుస్తారు.
- అదేవిధంగా ఆయుష్మాన్ కార్డులు ఏప్రిల్‌లో అందించనున్నారు. ఈ కార్డుతో దేశంలో ఎక్కడైనా ఆయుష్మాన్ భారత్ సేవలు పొందవచ్చు.
- ఈ కార్డుతో 1886 రకాల వ్యాధులకు చికిత్స చేస్తారు. ప్రధానంగా మోకాలి చిప్ప మార్పిడి, కిడ్నీ, గుండె మార్పిడి వంటి అనేక రకాల వ్యాధులకు శస్త్ర చికిత్సలు చేయించుకునే వీలుంది.

కుటుంబంలో ప్రతీ ఒక్కరికీ కార్డు

- ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ కార్డు కలిగి ఉంటే దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఉచిత వైద్య సేవలు పొందేలా రూపొందించారు.
- కుటుంబంలో ప్రతీ ఒక్కరికి వేర్వేరుగా ప్రత్యేక కార్డులు అందజేస్తారు. ప్రతీ ఒక్కరు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య శ్రీ కార్డు పొందేందుకు అర్హులు.
- ఈ నెల 31 వరకు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. ప్రత్యేక కేంద్రం వద్ద ఆరోగ్య మిత్ర, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారు.
- లబ్ధిదారు తప్పనిసరిగా శిబిరానికి వెళ్తే ఫోటో తీసుకొని వివరాలు నమోదు చేసుకుంటారు.
- సంగారెడ్డి జిల్లాలో మొత్తం 1,44,309 లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 1,07,764 మంది నమోదు చేసుకున్నారు. ఇంకా 36545 మంది నమోదు చేసుకోవాల్సి ఉంది.


ఆయుష్మాన్ భారత్ కార్డులు

డబ్బులు అడిగితే సమాచారం ఇవ్వండి



రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు అర్హులు. ఆరోగ్యమిత్ర, ఆరోగ్య శ్రీ ఎంప్యానెల్ ఉన్న ఆసుపత్రుల్లో లేదా సీఎస్‌సీ కేంద్రాల్లో ఉచితంగా నమోదు చేస్తారు. ఈ నెల 31వరకు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకుని ఆయుష్మాన్ భారత్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి. నమోదు చేసే కేంద్ర వద్ద ఎవరైన డబ్బులు అడిగితే 7013220347 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి.

– ప్రమోద్‌కుమార్, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయకర్త

పథకంపై అవగాహన కల్పించాలి



కేంద్ర ప్రభుత్వం దేశంలోని నిరుపేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. కానీ ప్రచార లోపంతో క్షేత్ర స్థాయి లో వాటి ఫలాలు వారికి అందడం లేదు. అధికారులు గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ నమోదుకు శిబిరాలు ఏర్పాటు చేసి తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి. ఆయుష్మాన్‌తో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుంది. ఈ–కేవైసీ చేయించేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్ గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నాచగిరిలో ఆధ్యాత్మిక వైభవం

శ్రీలక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భక్తులు


నాచగిరి బ్రహ్మోత్సవాల జ్యోతి ప్రజ్వలనచేస్తున్న శ్రీమధుసూదనానందస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి తదితరులు

వర్గల్(గజ్వేల్): మంగళ వాయిద్యాల హోరు, వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధమైన వర్గల్ మండలం నాచారం గుట్ట శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని నవాహ్నిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం నాచగిరి శ్రీక్షేత్ర పీఠం శ్రీమధుసూదనానందస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఈఓ కట్ట సుధాకర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మాజీ ధర్మకర్త రాములు గౌడ్, తలకొక్కుల దుర్గాప్రసాద్, ఆలయ సిబ్బంది సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాంచరాత్ర ఆగమ పద్ధతిలో..

అనంతరం ఆలయ అర్చక పరివారం, వేదపండితులు పాంచరాత్ర ఆగమ పద్ధతిలో ఉత్సవ పూజలకు శ్రీకారం చుట్టారు. ఊరేగింపుగా కోనేరు ప్రాంతం నుంచి పుట్టమన్ను తెచ్చారు. ముఖమండపంలో విశ్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహవాచనం, అంకురార్పణం, నీరాజనం, మంత్రపుష్పాది పూజలు నిర్వహించారు. రుత్వికులు, యజమానులకు రక్షా బంధనాలు కట్టారు.

సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ సుభిక్షం

సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ సుభిక్షంగా మారిందని, గతంలో వట్టిపోయినట్లు కన్పించిన నాచగిరి హల్దీవాగు మండు వేసవిలోనూ గోదావరి జలాలతో పరవళ్లు తొక్కుతోందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. ఆయనకు నాచగిరి నృసింహుని అనుగ్రహం, ఆశీస్సులు సంపూర్ణంగా ఉండాలని కోరుకున్నారు.

నేడు ధ్వజారోహణం

లోక కల్యాణమే పరమావధిగా నిర్వహిస్తున్న నాచగిరీశుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుంది. గరుఢ ఆళ్వారుకు మహానివేదన చేసి బ్రహ్మోత్సవ బాధ్యతలను అప్పగిస్తారు. రాత్రి భేరీ పూజ నిర్వహించి సకల దేవతలకు ఆహ్వానం పలుకుతారు.

హత్యకేసు నిందితుల అరెస్ట్


పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

సదాశివపేట(సంగారెడ్డి): హోలీ పండగరోజు రాత్రి సదాశివపేట శివపురికాలనీలో గొడవపడుతున్నవారిని అడ్డుకునేందుకు వెళ్లిన వ్యక్తిని హత్యచేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శివపురికాలనీకి చెందిన భాగ్యరాజ్ ఇంటి వెనుకగల బాత్‌రూం స్థలం విషయంలో భాగ్యరాజ్, అత్తాపురం ప్రేమ్‌కుమార్, అత్తాపురం కిషోర్‌కుమార్‌ల మధ్య గతంలో గొడవలు జరిగాయి. హోలీ పండుగ రోజు పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని జంగిలి భాగ్యరాజ్‌తో అత్తాపురం ప్రేమ్‌కుమార్, అత్తాపురం కిషోర్‌కుమార్ ఉద్దేశపూర్వకంగా గొడవపెట్టుకున్నారు. వారు భాగ్యరాజ్‌ను కొడుతున్న సమయంలో ఇంటికి వెళ్తున్న హతుడు జంగలి సుధాకర్ చూసి ఎందుకు భాగ్యరాజ్‌ను కొడుతున్నారంటూ అతడిని విడిపించేందుకు ప్రయత్నిం చేశాడు. ఆగ్రహించిన అత్తాపురం ప్రేమ్‌కుమార్, కిషోర్‌కుమార్ జంగిలి సుధాకర్‌ను బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడు మరణించాడని గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుడి భార్య జంగిలి రాణి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పాన్‌షాప్‌లో చోరీ

రూ.80 వేల విలువ చేసే సామగ్రి అపహరణ


పాన్‌షాపు వెనుక రేకును తొలగించిన దృశ్యం

పటాన్‌చెరుటౌన్: పాన్‌షాప్‌లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన పటాన్‌చెరు పట్టణంలో చోటు చేసుకుంది. శనివారం బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరుకు చెందిన ఆసిఫ్ ఆల్విన్ కమాన్ సమీపంలోని ఎస్‌కె పాన్ మహల్ నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి షాపు మూసి ఇంటికెళ్లాడు. శనివారం షాపుకెళ్లి చూడగా షాపు వెనుక భాగం తొలగించి రూ.80 వేలు విలువ చేసే సామగ్రిని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గ్రహించాడు. వెంటనే పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి ఆత్మహత్య

- అడవిలో చెట్టుకు ఉరేసుకున్న గిరిజన రైతు
- మృతుడు కౌడిపల్లి వాసిగా గుర్తింపు

మెదక్ రూరల్: అనారోగ్య సమస్యలు తట్టుకోలేక ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శమ్నాపూర్ శివారులోని రాజరాజేశ్వర స్వామి ఆలయం పక్కన గల అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని గుర్తుతెలియని వృద్ధుడు చనిపోయినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి ఫొటోను సామాజిక మాధ్యమాలతో పాటు ఆయా పోలీస్ స్టేషన్‌లకు పంపి వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు. మృతుడు కౌడిపల్లి మండం అంతారం పరిధిలోని జయరామ్ తండాకు చెందిన గిరిజన రైతు బర్మావత్ హేమ్లా(75)గా గుర్తించారు. మృతుడు కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం మెదక్‌లోని జిల్లా ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కంగారుపడిన కుటుంబీకులు హేమ్లా కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. సోషల్ మీడియాలో కనిపించిన ఫొటో ఆధారంగా గుర్తించారు. మృతుడి కుమారుడు రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సైబర్ నేరాలపై ఉక్కుపాదం

సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలపూ దృష్టిసారించామని, నేరాల నియంత్రణకు ఉక్కుపాదం మోపుతామని సీపీ శ్వేత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ప్రతీరోజు ఏఏ సైబర్ నేరాలు జరుగుతున్నాయో మీడియా ద్వారా తెలియజేస్తామన్నారు. సైబర్ నేరగాళ్లు తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించవచ్చని ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం సామాజిక మాధ్యమాల్లో పంచుకోకూడదన్నారు. ఫోన్లు వినియోగించేటపుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన సైబర్ నేరాల వివరాలు వెల్లడించారు.

- భూంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి అపరిచితుడు ఫోన్ చేసి జాబ్ వచ్చిందని, దానికి కొంత రుసుము చెల్లించాలని నమ్మబలికాడు. అది నమ్మిన వ్యక్తి అపరిచితుడికి ఆన్‌లైన్‌లో రూ.30వేలు పంపించాడు. అనంతరం ఆ నంబర్‌కు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన రాకపోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించి 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.
- సిద్దిపేటకు చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి వేర్వేరు వాట్సాప్ నంబర్ల నుంచి ఫోన్ చేస్తూ లోన్ ఇస్తామని చెప్పాడు. అది ఫేక్ అని గ్రహించి స్పందించకపోవడంతో సైబర్ నేరస్తుడు మళ్లీ ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వివాహిత ఆత్మహత్య

కోహెడరూరల్(హుస్నాబాద్): నిందలు వేస్తున్నారని మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన పొన్నాల కవిత(35) అదే గ్రామానికి చెందిన బోయిని కనకవ్వ, బోయిని కనకయ్య నిందలు వేస్తూ అవమానిస్తున్నారని ఆవేదన చెందేది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. మృతురాలి తల్లి బోయిని రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్, మెదక్

DCCB MEDAK

(ప్రభుత్వ భాగస్వామ్య సంస్థ)

ప్రధాన కార్యాలయము : సంగారెడ్డి, తెలంగాణ రాష్ట్రము

బంగారు ఆభరణముల వేలము ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా డి.సి.సి.బి మెదక్ నందు వివిధ బ్రాంచీలలో ఈ దిగువ తెలుపబడిన వ్యక్తులు బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పు తీసుకొనియున్నారు. అట్టి అప్పును చెల్లించమని వీరికి మూడు నోటీసులు ఇచ్చినప్పటికీ సకాలంలో అప్పు తిరిగి చెల్లించనందున వారి ఆభరణములను తేది: 15-03-2023 నాడు ప్రధాన కార్యాలయము, సంగారెడ్డి నందు ఉ.11.00 గం.ల నుండి వేలము వేయబడును.

వేలము నియమ నిబంధనలు:

1. వేలములో పాల్గొనదలచిన వారు రూ.5000/- సెక్యూరిటీ డిపాజిట్ చేయవలెను.
2. వేలందారులు మొత్తము డబ్బును వెంటనే చెల్లించి ఆభరణములు తీసుకొనవలెను.
3. ఆభరణములను వేలము సమయములో మాత్రమే తనిఖీ చేసుకొనవలయును.
4. ఆభరణములను సరి అయిన విలువ రానిచో లేదా ఏ కారణముతో అయినా వేలము రద్దు చేయుటకు బ్యాంకుకు అధికారము కలదు.
5. వేలము తేది వరకు వడ్డీ లెక్కించబడును.
6. వేలము వేయు క్రింది జాబితాలో గల ఆభరణములు సంబంధిత రుణగ్రహీత వేలము సమయము వరకు బకాయిపడిన అప్పు మొత్తము చెల్లించినట్లయితే అట్టి వాటిని మినహాయించి మిగతా రుణములకు సంబంధించిన ఆభరణములు మాత్రమే వేలము వేయబడును.

మిగతా విషయములకు సంబంధిత బ్రాంచి మేనేజరు / సి.ఇ.ఓ గారిని సంప్రదించగలరు.

క్రమ సంఖ్య	బ్రాంచి పేరు	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు	నివాసము	స్థూల బరువు గ్రాములలో
1.	దుబ్బాక	170450400019207	ఎల్కపల్లి బాబు	పోతిరెడ్డిపేట్	15.30
2.	ఎక్స్‌టెన్షన్ కౌంటర్	172150400010777	విస్లావత్ చందర్	కంది తాండ	25.00
3.	గజ్వేల్	170550410036520	బండారి గణేష్	గిరిపల్లి	14.50
4.	పోతిరెడ్డిపల్లి	173650420005028	బొడ్డు సాయిలు	మల్కాపూర్	91.30
5.	సదాశివపేట్	171450400015139	బుచ్చయ్య మన్నె	రేజింతల్	25.10
6.	గుమ్మడిదల	172550400000762	అరట్ల జ్యోతి	కొత్తపల్లి	25.45
7.		172550400005933	జొన్నలగడ్డ సుదర్శన్‌రెడ్డి	త్రిపురం, నల్గొండ	14.46
8.		172550400005953	రాణి మ్యాదరి	కానుకుంట	30.00
9.		172550400005965	జొన్నలగడ్డ సుదర్శన్‌రెడ్డి	త్రిపురం, నల్గొండ	10.88
10.		172550400005977	రాణి మ్యాదరి	కానుకుంట	10.69
11.		172550400006074	రాహుల్ రెడ్డి చంద్రప్ప	గుమ్మడిదల	62.27

తేది: 10-03-2023

సం/-
ముఖ్య కార్యనిర్వహణాధికారి
జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి., మెదక్,
ప్రధాన కార్యాలయము, సంగారెడ్డి

పట్టాభూమిలో మృతి చెందిన కోళ్ల పూడ్చివేత

పోలీసులకు భూయాజమానుల ఫిర్యాదు


గుంతలో మృతి చెందిన కోళ్లను పూడ్చిన దృశ్యం

తూప్రాన్:తమ వ్యవసాయ పట్టా భూమిలో ఓ కోళ్ల వ్యాపారి ఎలాంటి అనుమతులు లేకుండా మృతి చెందిన కోళ్లను పూడ్చివేస్తున్నాడని భూ యాజమాని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన సాదక్, మహ్మద్ ఫిరోజ్ పట్టా భూమి పట్టణ సమీపంలోని ఆర్కే ఫౌల్ట్రీఫాం వద్ద సర్వే నంబరు 726లో 2.20 ఎకరాలు ఉంది. గతంలో మృతి చెందిన కోళ్లను బాయిలర్‌లో వేసి కాల్చివేసేవారు. ప్రస్తుతం తమ భూమిలో కోళ్లను పూడుస్తుండటంతో వారిని హెచ్చరించగా నిలిపివేశారు. మళ్లీ పెద్ద గుంతలు తీసి పూడ్చివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాము పంటలు ఎలా సాగు చేసుకోవాలని వాపోయారు. ఫౌల్ట్రీ నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

చేగుంట(తూప్రాన్): రహస్యంగా ఎండు గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ రామిరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చిన్నశంకరంపేట మండలంలోని జేకే వైర్స్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన రామ్‌భవన్‌కుశవా, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జగదీష్‌కుమార్ పనిచేస్తున్నారు. చేగుంట గాంధీ చౌరస్తా సమీపంలో ఎండు గంజాయి అమ్ముతున్న విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ సిబ్బందితో వెళ్లి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి నుంచి 510 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్ ఎల్లయ్య, కానిస్టేబుల్స్ రవి, రాజు, నరేశ్, హరీశ్, నవీన్‌ను అభినందించారు.


గంజాయితో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడిన నిందితులు